ప్రజాశక్తి

బుధవారం 30 ఆగస్టు 2023

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

ఎంతకాలమీ పర్రాకులు

- ల్యాండ్‌పూలింగ్ బాధితుల ఆవేదన
- భూములు కోల్పోయిన వారికి నేటికీ ఇవ్వని స్థలాలు
- కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్న పేదలు



అనకాపల్లి కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ల్యాండ్‌పూలింగ్‌లో భూములు కోల్పోయిన పేదలు స్థలాల కోసం కలెక్టరేట్‌కు తరుచూ వస్తున్నారు. ల్యాండ్‌పూలింగ్ ఓనర్‌షిప్ సర్టిఫికెట్ ఆర్‌డిఒ జారీచేసినా పేదలకు స్థలాలు కేటాయించి అప్పగించడంలేదు. నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకం కింద తమ సాగు భూమిని ఇవ్వడానికి పేదలు అంగీకరించేలా బలవంతం చేసిన ప్రభుత్వ యంత్రాంగం... జిఒ ప్రకారం లే అవుట్ వేసి స్థలాలు ఇవ్వడానికి తగిన చొరవచూపడంలేదు. ల్యాండ్‌పూలింగ్ కింద ఉమ్మడి జిల్లాలోని విశాఖ రూరల్, గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, భీమిలి, పరవాడ, అనకాపల్లి, పద్మనాభం, ఆనందపురం, సబ్బవరం మండలాల్లోని 55 గ్రామాల్లో 6116.50 ఎకరాలు సమీకరించాలని 2020 జనవరి 25న ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 72లో పేర్కొంది. డి.పట్టా రైతులకు ఎకరాకు 900 గజాలు, ప్రభుత్వ భూమిలో 10 ఏళ్లకు పైబడి సాగు చేస్తున్న రైతుకు ఎకరాకు 450 గజాలు, ఐదు నుంచి పదేళ్ల మధ్య సాగుచేసే రైతుకు 250 గజాలు చొప్పున లే అవుట్లలో స్థలమివ్వనున్నట్లు జిఒలో తెలిపింది. తమ భూమిలోని జీడి, మామిడి తోటల ఫలసాయం చేతికొచ్చాక భూములిస్తామన్నా, సమయమివ్వకుండా పువ్వుతోవున్న తోటలను ప్రభుత్వ యంత్రాంగం నేలమట్టం చేసింది. భూములు స్వాధీనం చేసుకున్న 2020 నుంచి ఫలసాయం పోయిందని పేదలు వాపోతున్నారు. తీసుకున్న మిగతా 2లో..



సభలో మాట్లాడుతున్న సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవిఎస్.శర్మ

మాతృభాషను కాపాడుకుందాం

విశాఖలో ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి సభ వార్త మెయిన్‌లో..

ఉత్సాహంగా ఎకో వైజాగ్ వాక్



ఎకో వైజాగ్ వాక్‌లో పాల్గొన్న రోజర్ బిన్నీ, తదితరులు

ఎంవిపి.కాలనీ: జివిఎంసి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా ఆర్కే బీచ్ కాళీమాత గుడి నుంచి మంగళవారం నిర్వహించిన ఎకో-వైజాగ్ వాక్‌కు విశేష స్పందన లభించింది. బిసిసిఐ అధ్యక్షులు రోజర్ బిన్నీ, విశాఖ జిల్లా మిగతా 2లో..

ఉక్కు భూములను ప్రైవేటుకిస్తే

బిజెపి, వైసిపిలకు తగిన శాస్తి

సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గు నాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ ఉక్కు భూములను ప్రైవేట్ సంస్థలకు కేటాయిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన శాస్తి తప్పదని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో మంగళవారం హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు నాడు 64 గ్రామాల ప్రజలు 24 వేల ఎకరాల భూములను త్యాగం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్లాంట్ ఏర్పాటు వల్ల తమ వారసులకు పర్మినెంట్ ఉపాధి లభించి, వారి జీవితాలు సుఖవంతం అవుతాయని వారు ఆశించారన్నారు. కానీ త్యాగం చేసిన రైతుల ఆశలను వమ్ము చేసి కేంద్ర ప్రభుత్వం నేటికీ 8,500 మంది నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. పైపెచ్చు మిగతా 2లో..

కెఎ.పాల్ 'ఉక్కు' దీక్ష భగ్నం

వార్త మెయిన్‌లో..

విష జ్వరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి

వార్త 5లో..

మొదటి పేజీ తరువాయి..

ఎంతకాలమీ పర్రాకులు

భూమికి ఇస్తామన్న స్థలం కూడా ఇవ్వకుండా ప్రభుత్వం బాధపెడుతోందని 'ప్రజాశక్తి' వద్ద వారు ఆవేదన వ్యక్తంచేశారు. జీడి, మామిడి తోటపై ఎకరాకు వచ్చే 15 నుంచి 20 వేల రూపాయల ఫలసాయం నాలుగేళ్లుగా కోల్పోయామని అన్నారు. పేదల దగ్గర తీసుకున్న భూమికి స్థలాలివ్వకుండా తిప్పుతున్నారని చెప్పారు. భూములను లే అవుట్ల కింద అభివృద్ధి చేసే బాధ్యత వియంఆర్‌డిఎకు ప్రభుత్వం అప్పగించింది. ఇప్పటికీ భూములు తీసుకున్న అనేక ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయని పరిస్థితివుంది. ల్యాండ్‌పూలింగ్ ఓనర్‌షిప్ సర్టిఫికెట్ రైతుకు ఇచ్చినా స్థలాలు మాత్రం కేటాయించకుండా తాత్సారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే అనకాపల్లి మండలంలోని ల్యాండ్ పూలింగ్‌లో తీసుకున్న భూములకు స్థలాలు కేటాయించాలని కూండ్రం, రొంగలివానిపాలెం, కుంచంగి, వేటజంగాలపాలెం, సంపతిపురం, తమ్మయ్యపేట, వెంకుపాలెం, కోడూరు, గొలగాం, మామిడిపాలెం, రేబాక, పాపయ్యశాంతపాలెం, కోడుపాలెం, మారేడుపూడి, గోపాలపురం రైతులు ఈ సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి తమ సమస్యలను మొరపెట్టుకున్నారు.

భూమి తీసుకొని నాలుగేళ్లయింది



ప్రభుత్వమిచ్చిన 1.81 సెంట్లులో జీడి తోట పెంచాను. ఏడాదికి రూ.15 వేలకుపైగా ఆదాయం వచ్చేది. భూమిస్తే బాగుచేసి జాగా ఇస్తామని చెప్పారు. భూమి తీసుకొని నాలుగేళ్లయింది. స్థలమివ్వలేదు. ఎవరూ పట్టించుకోవడంలేదు.

యల్లబిల్లి బాపూజీ, కోడూరు

కష్టపడిన డబ్బులు ఛార్జీలకు పోతున్నాయి



మా అత్తయ్య పెద్దమ్మ పేరున 1.01 ఎకరాల్లో ప్రభుత్వం డి పట్టా ఇచ్చింది. మా అత్తయ్య, మా ఆయన చనిపోయారు. నా పేరున 1.01 ఎకరాలకు 909 చదరపు గజాల స్థలమిస్తామని (ల్యాండ్‌పూలింగ్ ఓనర్‌షిప్ సర్టిఫికెట్) పత్రమిచ్చారు. ఆదాయమొచ్చిన జీడి, మామిడి తోట తీసుకున్నారు. వేరే ఆధారంలేదు. భూమి తీసుకొని స్థలమివ్వకపోవడంతో తిరుగుతున్నాం. కష్టపడిన డబ్బులు స్థలాల కోసం తిరిగిన ఛార్జీలకు వస్తున్నాయి. ఎలా బతకమంటారు ? భూముల ఆస్కారం తీసేయడంతో అనేక పర్రాకులు (ఇబ్బందులు) పడుతున్నాం.

వియ్యపు దేవి, రొంగలవానిపాలెం

ఉక్కు భూములను ప్రైవేటుకిస్తే బిజెపి, వైసిపిలకు తగిన శాస్తి

గంగవరం పోర్టు ఏర్పాటుకు 1400 ఎకరాల భూములను కేటాయించారన్నారు. ఇందులోనూ నిర్వాసితులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పేర్కొన్నారు. గంగవరం పోర్టును కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తమ మిత్రుడు అదానీకి ధారాదత్తం చేసిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు రావాల్సిన కోకింగ్ కోల్, ముడిసరుకును అన్‌లోడింగ్ చేయనివ్వకుండా నేడు అదానీ గంగవరం పోర్టు తీవ్ర ఆటంకాలు సృష్టించి ప్లాంట్‌ను ఆర్థికంగా దెబ్బతీయాలని చూస్తోందని తెలిపారు. ఇప్పుడు దీంతోపాటు స్టీల్‌ప్లాంట్ భూములపై అదానీ సంస్థ కన్నేసిందన్నారు. వెయ్యి ఎకరాల భూమిని కాజేసేందుకు కేంద్రంలో తమ అనుకూల ప్రభుత్వం ద్వారా ప్రయత్నించడం అత్యంత ఆందోళనకర విషయమన్నారు. క్రమేపీ స్టీల్‌ప్లాంట్‌ను కబళించాలనే కుట్ర పన్నుతోందన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కేంద్రానికి దాసోహం అయి ఇప్పటికే గంగవరం పోర్టులో తనకున్న 10.6 శాతం వాటాను అదానీకి కట్టబెట్టిందన్నారు. రైతులు తమ భూములను త్యాగం చేసింది ప్రైవేటు వ్యక్తుల సంపద కూడబెట్టుకోవడం కోసం కాదని జగ్గునాయుడు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టిపరిస్థితుల్లోనూ అదానీకిగానీ, జిందాల్‌కుగానీ, మరే ఇతర ప్రయివేటు సంస్థలకుగానీ స్టీల్‌ప్లాంట్ భూములను కట్టబెట్టడానికి వీలులేదన్నారు. ప్రభుత్వ కుట్రలను వమ్ముచేసి ప్లాంట్ భూములను కార్మికులు, ప్రజలు కాపాడుకుంటారన్నారు. భూములను అమ్మడం, లీజులకు ఇవ్వడం ద్వారా స్టీల్‌ప్లాంట్ ఎట్టిపరిస్థితుల్లోనూ పురోభివృద్ధి సాధించలేదన్నారు. కేంద్రం దీనికి సొంత గనులు, ముడిసరుకు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వాలని, ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతన ఒప్పందాలు అమలు చేయాలని, నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ముందు సాగిలపడడం ఆపి పోరాడాలన్నారు. టిడిపి, జనసేనలు కేంద్రంపై చిత్తశుద్ధితో ఒత్తిడి తేవాలన్నారు.

తీర శుభ్రతకు సరికొత్త యంత్రాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ తీర ప్రాంతాలను శుభ్రపరిచేందుకు జివిఎంసి సరికొత్త యంత్రాలను సమకూర్చుకుంది. రుషికొండ, ఆర్కే బీచ్, భీమిలి తదితర చోట్ల 'ఇకో వైజాగ్'లో భాగంగా తీర ప్రాంతాన్ని శుభ్రం చేయించేందుకు 'బీచ్ టెక్ 2000ఎస్' పేరిట ఐదు వాహనాలను రూ.9.98 కోట్లతో మూడేళ్ల పాటు లీజుకు తీసుకుంది. మరో వాహనాన్ని 15వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ.82 లక్షల ఖర్చుతో జివిఎంసి సొంతంగా సమకూర్చుకుంది. బీచ్ క్లీనింగ్ పేరిట ఐదు వాహనాలు నిత్యం తీర ప్రాంతాల్లో తిరుగుతూ వ్యర్థాల్ని ఏరివేస్తాయని, మరో వాహనం స్టాండ్‌బైగా ఉంటుందని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఈ వాహనాల పనితీరును ఆర్కే బీచ్‌లో మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఎఎంఒహెచ్‌లు డాక్టర్ రాజేష్, డాక్టర్ కిషోర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ అక్రమాలపై జనసేన మహా ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగర పరిధిలో రూ.26 వేల కోట్ల విలువైన భూములను వైసిపి నేతలు ఆక్రమించుకున్నారని జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు ఆరోపించారు. వైసిపి నేతల భూ ఆక్రమణలు, అవినీతి విధానాలను నిరసిస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జనసేన ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నేతలు అధికారాన్ని, పదవులను అడ్డుపెట్టుకొని దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులను ఎవరిని అడిగి తాకట్టు పెడుతున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పంచకర్ల రమేష్ బాబు, ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్, నాయకులు పంచకర్ల సందీప్, పీలా రామకృష్ణ, కార్పొరేటర్లు పీతల మూర్తి యాదవ్, భీశెట్టి వసంత లక్ష్మి, కందుల నాగరాజు, దల్లి గోవింద్, మత్స్యకార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చందన మోహనరావుకు సతీ వియోగం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరానికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారవేత్త చందన మోహనరావు సతీమణి సుబ్బలక్ష్మి మంగళవారం కన్నుమూశారు. చందన బ్రదర్స్‌ను నెలకొల్పి 40 సంవత్సరాలుగా సేవలందించి.. అనంతరం సిఎంఆర్‌గా రూపాంతరం చెంది తెలుగు రాష్ట్రాలలో అనేక శాఖలకు విస్తరించడంలో మోహనరావు పాత్ర ఎంతో విశిష్టమైనది. ఆయన ధర్మపత్ని సుబ్బలక్ష్మి కృషి కూడా ఇందులో దాగి ఉంది. విషాద సమాచారం తెలియడంతో నగరంలో ప్రముఖ వ్యాపార వేత్తలు, ప్రజా ప్రతినిధులు చందన మోహన రావును, మావూరి వెంకట రమణను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



సుబ్బలక్ష్మి (ఫైల్‌ఫోటో)

ఉత్సాహంగా సెయింట్స్ స్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 50 ఏళ్లుగా విశాఖపట్నంలో విశేష సేవలందిస్తున్న అల్ సెయింట్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు సిరిపురంలోని వుడా చిల్డ్రన్స్ ఎరీనాలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో స్పెషల్ ఎకనమిక్ జోన్ డిప్యూటీ జాయింట్ కమిషనర్ కె.రోషిని అపరంజి, విశాఖ ఎయిర్‌పోర్టు డిప్యూటీ కమాండెంట్ చేట్రోలు కీర్తి కిరీటి, స్కూలు కరస్పాండెంట్ వి.కమలా దేవి, చైర్మన్ విడి.రవీంద్ర సుందర్, ప్రిన్సిపల్ ఎస్.మెర్సీ ఎస్తేర్, రెవ్. వి.రవీంద్ర సుందర్ పాల్గొన్నారు.

ఉమాగాంధీ అందరికీ ఆదర్శం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన డాక్టర్ మురహరరావు ఉమాగాంధీ అందరికీ ఆదర్శనీయమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. శివాజీపాలెంలోని జివిఎంసి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ఉమాగాంధీ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన నేపథ్యంలో ఆమెను మేయర్ మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, జివిఎంసి డి.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎకో వైజాగ్ వాక్

(మొదటి పేజీ తరువాయి..)

కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఇండియన్ క్రికెటర్ శ్రీకర్ భరత్, ఎసిఎ కార్యదర్శి గోపినాథ్ రెడ్డితో కలిసి జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎకో-వైజాగ్ అభివృద్ధికి ప్రజా స్పందన అమోఘమని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోనే విశాఖ ఆదర్శ నగరంగా నిలువనుందని తెలిపారు. రోజర్ బిన్నీ మాట్లాడుతూ విశాఖ నగరం ఎటు చూసినా సుందరంగా కనిపిస్తోందని కొనియాడారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, జివిఎంసి అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ పాల్గొన్నారు.

మహిళలకు గాయకుల సంఘం చేయూత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ గాయనీ గాయకుల సాంస్కృతిక సంస్థ తన సామాజిక సేవలో భాగంగా బీచ్ రోడ్డులోగల బాలవికాస్ ఫౌండేషన్‌లోని మహిళల కుట్టు శిక్షణకు సాయం అందించింది. మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కుట్టు సామగ్రి, రూ.2500 నగదు అందజేసింది. ఇటువంటి సేవా కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని సంస్థ అధ్యక్షులు భయ్యా శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా బాధ్యులు సన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. పట్నం వెంకటేష్, భూపతిలు ప్రత్యేక ఆర్థిక సహకారాన్ని బాలవికాస్ ఫౌండేషన్ నిర్వాహకులు నరవ ప్రకాష్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో ఎంటిఆర్. నాగేశ్వరరావు, భూపతి, నాంచారయ్య, పుండరీ కుమార్ పాల్గొన్నారు.

వైసిపి హయాంలో అన్నింటా దోపిడీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి ప్రభుత్వ హయాంలో అన్నింటా దోపిడీ తీవ్రమైందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు మండిపడ్డారు. మంగళవారం పార్టీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేరు వెనకాల రెడ్డి ఉంటే వారికి పదవులు కట్టబెడుతున్నారని విమర్శించారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి రెండో వార్డుకు చెందిన పలువురు మహిళలు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో వైసిపిలో చేరారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారికి ముత్తంశెట్టి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో వైసిపి మళ్లీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి రెండో వార్డు నాయకులు ఎస్.కరుణాకరరెడ్డి, సరగాణి, కొప్పల రమేష్, చిల్ల భాస్కరరెడ్డి, ప్రమీల, డి.రామయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్ఏఎల్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తగరపువలస శ్రీ మణికంఠ స్వీట్స్ అండ్ బేకరీ యాజమాన్యం మంగళవారం ఫ్యాన్లు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ఇందుకు గాను సంబంధిత యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 60 మందికి జరిమానా

ప్రజాశక్తి -భీమునిపట్నం : మద్యం తాగి వాహనాలు నడిపిన 60 మందికి స్థానిక అదనపు మెట్రో పాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవిరావు మంగళవారం తెలిపారు. అంతేగాకుండా కమ్యూనిటీ సర్వీస్ శిక్ష కూడా విధించారని వివరించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ డైట్ ప్రాంగణంలో పిచ్చి మొక్కలను వారితో తొలగించారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణా నక్షత్ర పూజలు

ప్రజాశక్తి-సింహాచలం: వెంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని సింహాచల దేవస్థానం అనుబంధ ఆలయమైన కొండ దిగువన ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు శ్రవణా నక్షత్ర పూజలు నిర్వహించారు. ఆగమహోత్సవ సంవత్సర ప్రకారం పూజాది కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక అభిషేకాలు చేశారు. పూజల అనంతరం భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

గంభీరం ఐఐఎంలో హెరిటేజ్ ఫెస్ట్

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గంభీరం ఐఐఎం వద్ద హరే కృష్ణ వైకుంఠం ఆధ్వర్యాన హెరిటేజ్ ఫెస్ట్-2023 నిర్వహించారు. 5 నుంచి 7వ తరగతి విద్యార్థులచే ఉదయం స్వర సంగీత కార్యక్రమం ఏర్పాటుచేశారు. 13 పాఠశాల నుంచి 76 మంది విద్యార్థులు పాల్గొని అన్నమయ్య, త్యాగరాజు కీర్తనలు ఆలపించారు. మధ్యాహ్నం 8 నుంచి 10వ తరగతి విద్యార్థులచే గాత్ర సంగీత కార్యక్రమం నిర్వహించారు. 9 పాఠశాలల నుంచి 63 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గీత, కె.నిఖిత శ్రీవల్లి, అంబరీషదాస, ఆదోషజ దాస, కేశవకృప దాస, హరి మురారి దాస పాల్గొన్నారు.

'తెలుగు అధ్యాపకులు కావాలి'

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ తెలుగు సబ్జెక్టు -1 అధ్యాపకులు కావాలని ప్రిన్సిపాల్ ఎన్.కృష్ణవేణి తెలిపారు. వీరికి నెలకు రూ.10 వేలు పారితోషకం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎంఎలో 50 శాతం ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరు కావాలని కోరారు.

కృష్ణాపురం సాగునీటి కాలువకు నీరు విడుదల

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన సాగునీటి కాలువకు వైసిపి రైతు విభాగం అధ్యక్షుడు ఎం.అప్పలనాయుడు మంగళవారం నీరు విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది కాలువ పూడికతీతకు రూ.2 లక్షలు సొంత నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. 2019-20లో కూడా సొంత నిధులు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఏటా ప్రభుత్వం నిధులు ఇచ్చి తవ్వకాలు చేస్తే 1600 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని పూడికతీత తీయకుంటే కాలువ పూర్తిగా పూడుకుపోయి కనుమరుగవుతుందన్నారు. దీనివల్ల నాలుగు గ్రామాలకు చెందిన 1600 ఎకరాలు బీడు భూములుగా మారిపోతాయని తెలిపారు. నీరు విడుదల సందర్భంగా గంగమ్మ తల్లికి పసుపు కుంకుమలు సమర్పించారు. రైతులకు, కూలీలకు భోజన సౌకర్యం కల్పించారు.



గంగమ్మతల్లికి పూజ చేస్తూ నీటిని విడుదలచేస్తున్న అప్పలనాయుడు

నేత్రదానంపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార, మధురవాడ : జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణా సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ పి.విశ్వ మిత్ర ఆధ్వర్యాన మధురానగర్‌లోని జివిఎంసి హైస్కూల్లో నేత్ర దానం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పాఠశాలలోని 9, 10వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది, ఐ డొనేషన్ కౌన్సిలర్లు అవగాహన కల్పించారు. నేత్ర దానం ఆవశ్యకత గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెడ్‌మాస్టర్ డి.శాంతికుమారి, భవిత టీచర్ జగదాంబ, ఐ డొనేషన్ కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గీతం' నేత్రదాన వారోత్సవాలు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చిస్ (జిమ్సర్) ఆసుపత్రి, వైద్య కళాశాల ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన వారోత్సవాలలో భాగంగా మంగళవారం ఎండాడ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రొవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ, దేశంలో ఏటా లక్ష మందికి కార్నియా మార్పిడి ద్వారా దృష్టి తీసుకురావలసి ఉండగా కేవలం 25 వేల కార్నియా మార్పిడి మాత్రమే సాధ్యపడుతోందన్నారు. ప్రజలలో నేత్రదానం పట్ల అవగాహన పెంచడం ద్వారా ఈ కొరతను నివారించగలమని చెప్పారు. జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్పిరావు మాట్లాడుతూ, నేత్రదానం ద్వారా మరణించిన తర్వాత కూడా మనుషులు జీవించినట్లుగా భావించవచ్చున్నారు. దేశంలో నేత్రదానం పట్ల క్రమేపి అవగాహన పెరుగుతోందని తెలిపారు. జిమ్సర్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతి పద్మజ, నేత్ర విభాగం అధిపతి డాక్టర్ వివిఎల్.నరసింహారావు, డాక్టర్ వీణా, డాక్టర్ వినయిని, డాక్టర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నేత్రదాన వారోత్సవాలలో భాగంగా పరవాడలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు నేత్ర పరీక్షలతో పాటు నేత్ర దానం ప్రాధాన్యతను వివరించారు. పలు వైద్య పరీక్షలను సహితం నిర్వహించారు.

గీతంలో నార్త్ కరోలినా వర్సిటీ బృందం పర్యటన

ప్రజాశక్తి -మధురవాడ : అమెరికాకు చెందిన నార్త్ కరోలినా విల్మింగ్టన్ విశ్వవిద్యాలయం నిపుణుల బృందం మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ విద్యార్థులతో ఏర్పాటుచేసిన ముఖాముఖి కార్యక్రమంలో నార్త్ కరోలినా విల్మింగ్టన్ యూనివర్సిటీ అంతర్జాతీయ సంబంధాల విభాగం అసోసియేట్ ప్రొవోస్ట్ డాక్టర్ మైఖేల్ విలిహెమ్, అసోసియేట్ డీన్ డాక్టర్ నివిన్ రిచి పాల్గొని ప్రసంగించారు. తమ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ కోర్సులు, బోధన, పరిశోధన విధానాలను వారు వివరించారు. ఉన్నత విద్యను అభ్యసించడానికి తమ విశ్వవిద్యాలయం ఎంతో అనుకూలమైనదని తెలిపారు. అనంతరం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని మూర్తి పరిశోధనా కేంద్రాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ బి.రవికాంత్ గీతంలో విద్యార్థులకు జిసిజిసి ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు.

పలుచోట్ల గడపగడపకు మన ప్రభుత్వం



13వ వార్డులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంవివి.సత్యనారాయణ, కెల్ల సునీత

ప్రజాశక్తి -యంత్రాంగం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ, శివాజీనగర్, భగత్‌సింగ్‌నగర్ ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యాన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, కెల్ల సునీత ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలనడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి ఇన్‌ఛార్జి కెల్ల సత్యనారాయణ, శిరీష, పిల్లి వీర్రాజు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి రామకృష్ణ నగర్-2 సచివాలయం, ఎన్జీజీవోస్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, పార్టీ వార్డు ఇన్‌ఛార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, మాజీ కార్పొరేటర్ పోతు సత్యనారాయణ, 45వ వార్డు అధ్యక్షులు పైడి రమణ, పాండవ శ్రీను, రాయడు శ్రీను, జెసిఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, 26వ వార్డు నాయకులు శేషు, అమ్మాజీ, శ్యామల, గండ్రేటి రవి, ఎం.సునీల్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గడపగడపకు

యస్ రాయవరం :సమస్యలు గుర్తించి పరిష్కరించడమే గడపగడపకు కార్యక్రమం ముఖ్యోద్దేశమని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్లబాబూరావు అన్నారు. మంగళవారం రాయవరం దళిత కాలనీలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపిడిఒ రామచంద్రమూర్తి, తహశీల్దారు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మెగా ఫాగింగ్ మిషన్ ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : దోమల నివారణకు మెగా ఫాగింగ్ మిషన్‌ను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ, డెంగీ, మలేరియా వ్యాధులు సోకకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. ఈ మెగా ఫాగింగ్ మిషన్ ద్వారా రోజుకు రెండు వార్డులు చొప్పున జోన్ పరిధిలో ఉన్న అన్ని వార్డులలో ఫాగింగ్ చేయనున్నట్లు తెలిపారు. వంశీరెడ్డి మాట్లాడుతూ డెంగీ , మలేరియా వ్యాధులు సోకకుండా ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సింహాచలం, ఎఎంఒహెచ్ కిరణ్‌కుమార్, 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, బయలాజిస్ట్ సాంబమూర్తి, మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

శ్మశాన వాటికను తొలగించొద్దు

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం రోడ్డు విస్తరణలో మసీదులు సమీపంలో ఉన్న షాపులు, ముస్లిముల శ్మశానవాటికను తొలగించకుండా న్యాయం చేయాలని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజును ముస్లిం పెద్దలు కోరారు. అక్కయ్యపాలెం తాజ్‌బాగ్ మసీదు వద్ద మంగళవారం సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ఈ విషయాన్ని జివిఎంసి కమిషనర్, వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి దృష్టికి గతంలో తీసుకెళ్లానని, మరోసారి మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కొండా రాజీవ్‌గాంధీ, పీలా వెంకటలక్ష్మి, షేక్ జుబైర్, ముస్లిం మసీదు పెద్దలు రాము, అబీబ్, యాసిన్, అస్లాం, నూబ్ పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి అక్కయ్యపాలెం జగ్గరావు బ్రిడ్జి వద్ద రూ.39.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని వార్డు వైసిపి ఇన్‌ఛార్జి పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యాన నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు, స్థానిక టిడిపి కార్పొరేటర్ ముక్క శ్రావణి ప్రారంభించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రాజు, ఆళ్ల లీలావతి, వైసిపి నాయకులు శ్రీనివాసరావు, పోతు సత్యనారాయణ, బలుసు జగదీష్, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఇఇ శ్రీనివాస్, డిఇ శ్రీనివాసరాజు, ఎఇ శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దేశీయ గోజాతుల పెంపకం అవసరం

ప్రజాశక్తి-మాడుగుల: దేశీయ గోజాతుల పెంపకం పాడి రైతులకు ఎంతో అవసరమని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఇడి బి రామ్మోహనరావు అన్నారు.మంగళవారం పొంగలిపాకలో లేగ దూడల ప్రదర్శన ప్రారంభించారు. లింగ నిర్ధారిత వీర్య పథకం ద్వారా పొంగలిపాకకు చెందిన రైతు దామ రౌతు స్వామి నాయుడుకు చెందిన జెర్సీ దూడను చూసి రైతులు ఈ విధంగా పశుపోషణ చేయాలని సూచించారు. ప్రదర్శనలో ప్రధాన బహుమతి పచ్చికూర పరదేశి నాయుడు, ద్వితీయ బహుమతి కర్రి శ్రీను, తృతీయ బహుమతి పొన్నాడ రామారావు, కన్సోలేషన్ బహుమతులు వెల్లంకి నానాజీ, ఎర్ర రమణలకు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వాసుదేవరావు, ప్రజా ప్రతినిధులు నందారపు సత్యనారాయణ, మైచర్ల సన్యాసినాయుడు, పశు వైద్యాధికారులు నరేష్, మణి లక్ష్మణ్, అరుణ కిరణ్, గణేష్ , వైస్ సర్పంచ్ భాస్కర్ పాల్గొన్నారు

ఆర్అండ్‌బి రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి -యస్ రాయవరం: మండలంలోని అడ్డురోడ్డు నుండి నర్సీపట్నం వెళ్ళే ఆర్అండ్‌బి రోడ్డుకు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టినట్లు ఆర్అండ్‌బి సూపర్‌వైజర్ సింహాద్రిరాజు తెలిపారు. యలమంచిలి డిఇఇ సాగర్, ఎఇ జ్ఞానేశ్వరరావు ఆదేశాలతో అడ్డురోడ్డు నుండి కోటవురట్ల మండలం రామచంద్రాపురం వరకు బాగాపాడైన రోడ్డును ప్రొక్లయిన్‌తో చదును చేస్తున్నామన్నారు. అనంతరం పిక్క బూడిద వేసి లెవెల్ చేయిస్తామని తెలిపారు.



అడ్డురోడ్డు -నర్సీపట్నం రోడ్డుకు మరమ్మతులు

భెల్ పరిరక్షణకు ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌ను గెలిపించాలి

ఎన్నికల సభలో నాయకుల పిలుపు

ప్రజాశక్తి -గాజువాక : భెల్ హెచ్‌పివిపి యూనిట్ పరిరక్షణ కోసం ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌ను గెలిపించాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 31వ తేదీన భెల్ గుర్తింపు ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం కంపెనీ మెయిన్ గేటు ఎదుట సిఐటియు, ఐఎన్‌టియుసి, వైఎస్ఆర్‌టియుసి, ఎఐసిటియు ఆధ్వర్యాన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా వైఎస్.రాజశేఖరరెడ్డి ఉన్న సమయంలో ఈ పరిశ్రమను ఆదుకున్నారని గుర్తుచేశారు. వామపక్షాల మద్దతుతో నడిచిన యుపిఎ-1 ప్రభుత్వ సమయంలో బిహెచ్‌పివిని భెల్‌లోనూ, షిప్ యార్డ్‌ను డిఫెన్స్‌లోనూ విలీనమయ్యాయని తెలిపారు. అనుభవం ఉన్న ఫ్రంట్‌ను గెలిపించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరాం మాట్లాడుతూ, బిహెచ్‌పివి పరిశ్రమను కాపాడుకునేందుకు అనేక పోరాటాలు జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. స్టీల్‌ప్లాంట్‌లో గుర్తింపు యూనియన్‌గా గెలిచిన ఐఎన్‌టియుసి గడచిన సంవత్సర కాలంగా కార్మికులకు చేసింది ఏమీ లేదన్నారు. భెల్ కార్మికులు ఎఐటియుసి మాటలకు మోసపోవద్దని కోరారు. భెల్ పరిరక్షణ కోసం ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌ను గెలిపించేందుకు ఉదయించే సూర్యుడు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ, సంస్థ ప్రయోజనాలు, మెరుగైన వేతనాల కోసం ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌ను గెలిపించాలన్నారు. కార్మికుల కోసం అహర్నిశలు పోరాడే శక్తి ఈ ఫ్రంట్‌కు ఉందన్నారు. గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పోటీచేస్తున్న వి.బాబూరావు మాట్లాడుతూ, కీర్తిశేషులు రాజశేఖరరెడ్డి, సిపిఎం నాయకులు సీతారాం ఏచూరి, సిఐటియు నాయకులు తపన్‌సేన్ కృషితో బిహెచ్‌పివి భెల్‌లో విలీనమైందన్నారు. ఈ బహిరంగ సభలో అధ్యక్షులుగా పోటీ చేస్తున్న జిటిపి ప్రకాష్, వైఎస్ఆర్‌టియుసి నాయకులు వై.మస్తానప్ప, ఐఎన్‌టియుసి నాయకులు మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, ప్రోగ్రెసివ్ ఫ్రంట్ చీఫ్ పాట్రన్ ఎస్.జ్యోతీశ్వరరావు, దామోదర్ రెడ్డి, సిఐటియు నాయకులు కె.విజయకుమార్, పూర్వ యూనియన్ ప్రధాన కార్యదర్శి సోమనాథ్, ఐసిటియు నాయకులు పట్నాయక్ పాల్గొన్నారు.


బహిరంగ సభలో అభివాదం చేస్తున్న నాయకులు

ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకల్లో విశాఖ వాసులు


చంద్రబాబుతో డాక్టర్ సురేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎన్‌టిఆర్ శత జయంతి సందర్భంగా రూపొందించిన వంద రూపాయల స్మారక కాయిన్ ఆవిష్కరణ కార్యక్రమంలో విశాఖ వాసులూ పాల్గొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుకలో అతి కొద్దిమంది ఎన్‌టిఆర్ కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా విశాఖకు చెందిన ఐటి కంపెనీ సింబోయాసిస్ యజమాని ఒ.నరేష్ కుమార్ వ్యవహరించారు. విశాఖ డాల్ఫిన్ డయాగ్నస్టిక్స్ సెంటర్ అధినేత డాక్టర్ వంకాయలపాటి సురేష్‌కు కూడా ఆహ్వానం అందడంతో ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబును ఆయన కలిశారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, పాల్గొన్నారు.

ప్రణాళికతో కృషి చేస్తే విజయం

ప్రజాశక్తి -పిఎం పాలెం : మనలోని బలం, బలహీనతలను తెలుసుకొని ప్రణాళిక ప్రకారం కృషిచేస్తే విజయం సాధించడం సాధ్యమేనని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. కొమ్మాదిలోని జవహర్ నవోదయ విద్యాలయలో విద్యాలయ నిర్వాహక కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. కడప జిల్లా నవోదయ విద్యాలయలో చదువుకున్న తాను మొదట వైద్యవృత్తిలో ప్రవేశించి తర్వాత సివిల్స్‌కు ఎంపికైనట్లు చెప్పారు. నవోదయ విద్యాలయలో అందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలను వినియోగించుకుంటే విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకోవడం సాధ్యమేనని తెలిపారు. విద్యాలయానికి రెండు బోరు బావులు, నాలుగు తరగతి గదులు, పది కంప్యూటర్లు, పార్ట్ టైం డాక్టర్ సదుపాయాలను అందించడంతోపాటు స్టాఫ్ క్వార్టర్స్, రోడ్ల మరమ్మత్తులు చేయడానికి వీలుగా సిపిడబ్ల్యుయుడీకి సిఫారసు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కె.సంజయ్ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ వేలీ పాఠశాల ప్రిన్సిపల్ ఈశ్వరీ ప్రభాకర్, అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, నవోదయ విద్యాలయ వైస్ ప్రిన్సిపల్ కీర్తి తదితరులు పాల్గొన్నారు.

మారుతున్న చట్టాలపై విజ్ఞానం పెంచుకోవాలి




ప్రసంగిస్తున్న న్యాయమూర్తి ఎంవి శేషమ్మ

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : మారుతున్న చట్టాలకు అనుగుణంగా న్యాయవాదులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విశాఖ జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎంవి శేషమ్మ సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదంలో లోక్ అదాలత్ ఆధ్వర్యాన న్యాయ సహాయకుల, ఉచిత న్యాయ సహాయం అందించే న్యాయవాదులకు మంగళవారం ఒకరోజు శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవి.శేషమ్మ మాట్లాడుతూ, జాతీయస్థాయిలో పేద, మహిళలు, చిన్నారులు, వృద్ధులు, ఇతర వెనుకబడిన తరగతుల ప్రజలకు అందిస్తున్న న్యాయ సేవలను అందరూ వివరించాలన్నారు. సమాజంలో సామాన్య పౌరులకు సైతం న్యాయ ఫలాలను అందించే న్యాయవాదులు తమ సేవలను అన్ని వర్గాలకు అందించాలన్నారు. సేవా ప్రాధికార సంస్థ అందిస్తున్న సేవలను, అదాలత్ చట్టాలను వివరించారు. న్యాయ సేవా సంస్థ జాతీయ శిక్షకుడు, సీనియర్ న్యాయవాది రఘుపాత్రుని శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఏ వ్యక్తి న్యాయ ఫలాలకు దూరం కాకూడదన్న జస్టిస్ కృష్ణఅయ్యర్ చెప్పిన అంశాలను గుర్తు చేశారు. న్యాయవాదులందరూ సమాజానికి నిజమైన సేవకులుగా ప్రస్తుతించారు. ఇటీవల న్యాయ సేవ సంస్థ, సమాంతర న్యాయవాదులు, శాశ్వత న్యాయవాదులు అందిస్తున్న సేవలను అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎంవివికి అభినందనలు తెలుపుతున్నచొక్కాకుల

ఎంవివికి అభినందనలు

ప్రజాశక్తి-సీతమ్మధార : తూర్పు నియోజకవర్గం వైసిపి సమన్వయకర్తగా నియమితులైన ఎంపీ ఎంవివి సత్యనారాయణను చోడవరం నియోజకవర్గ వైసిపి ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంవివికి అభినందనలు తెలిపారు.


విఎస్ఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కాయల

విజయసాయిరెడ్డికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఛైర్మన్ ఆఫ్ ది పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఆన్ ట్రాన్స్‌పోర్టు, టూరిజం అండ్ కల్చర్‌గా నియమితులైన వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డిని మారీ టైం బోర్డు ఛైర్మన్ కాయల వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డిని సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటిని అధికారులకు రిఫర్ చేసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్‌ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు పాల్గొని మాట్లాడుతూ, మేజర్ ధ్యాన్ చంద్ జీవితం నేటి యువతరానికి స్ఫూర్తి దాయకమన్నారు. అనంతరం ఎస్ఐని ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల, అధ్యాపకులు సిహెచ్.విష్ణుమూర్తి, అనురమ, బి.సహదేవుడు, విద్యాసాగర్, ఎం.రమణ, శ్రీనివాసరావు, మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 24, 25, 26 తేదీలలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎన్.ప్రసాదరాజు పాల్గొన్నారు.

శొంఠ్యాంలోని శ్రీవెంకట్ విద్యాపీఠ్‌లో ప్రాంగణంలో స్పై స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కనమాం సర్పంచ్, స్పై స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ ఆబోతు అప్పలరాము, బొద్దపు బంగార్రాజు గవర ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో ప్రతిభ కనబరచిన అనకాపల్లి జిల్లా క్రీడాకారులను కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్ సత్కరించారు. ముందుగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వెయిట్ లిఫ్టర్ ఎంవి మాణిక్యాలు, ఇండియన్ బాక్సింగ్ టీమ్ కోచ్ ఐ.వెంకటేశ్వరరావు, అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్ కె.సూర్యనారాయణ, కళాశాల ప్రిన్సిపల్ ఆర్.వైకుంఠరావు పాల్గొన్నారు. **యలమంచిలి :** యలమంచిలి స్టేషన్ రోడ్డు జెడ్‌పి హైస్కూల్లో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. హెడ్ మిస్ట్రెస్ భవాని, కొణతాల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక కొత్తపేట హైస్కూల్ హెచ్ఎం వై.రమణ ఆధ్వర్యాన క్రీడోత్సవాలు నిర్వహించారు. కొత్తపేట సత్యా తైక్వాండో అకాడమీకి చెందిన బాల బాలికలు పట్టణంలో మౌన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో తైక్వాండో అకాడమీ డైరెక్టర్ నగిరెడ్డి సత్యనారాయణ మాట్లాడారు.



ఎన్ఎస్ఆర్ఐటిలో ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళి

దేవరాపల్లి : మండలంలోని ఎ.కొత్తపల్లి జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం వై.స్వర్ణలత ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం సమరెడ్డి తిరుపతిరావు, ఉపాధ్యాయులు కుమార్ ప్రకాష్, గోవింద్, నాగమణి, గోదాదేవి, రెహ్మాన్ పాల్గొన్నారు.

నక్కపల్లి : నక్కపల్లి లో డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జాతీయ స్పోర్ట్స్ డే నిర్వహించారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ పాల్గొన్నారు. నక్కపల్లిలో బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ ఏర్పాటుచేసి హాకీ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి కొల్నాటి తాతాజీలను అభినందించారు కార్యక్రమంలో తాతాజీ,కోచ్ రాంబాబు, కొల్నాటి నానాజీ, రామచంద్రరావు,రంజిత్ పాల్గొన్నారు.

యస్ రాయవరం : గుడివాడ జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ క్రీడ దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ గిడుగు రామమూర్తి చిత్రపటాలకు హెచ్ఎం నాగన్నదొర పీడీ. రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మహేశ్వరి, కమల, శుభలక్ష్మి, సుధారాణి, శ్రీదేవి, భవాని పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : చినవాల్తేరులోని కెడిపిఎం స్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల 2002 బ్యాచ్ విద్యార్థులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అడ్మిన్ డి.లక్ష్మీపతి, స్కూల్ ప్రిన్సిపాల్ సుమతి భాయి, పిఇటి యుఎన్.రత్నం పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విష జ్వరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం లేఖ

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి విషజ్వరాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. గ్రామాల్లో దోమల నివారణకు బ్లీచింగ్, పాగింగ్ చేయడం లేదని, పిహెచ్‌సిల్లో రక్తపరీక్షలకు కిట్లు, మందులు అందుబాటులో లేవని, జ్వరాల బారినపడిన వారికి సకాలంలో వైద్యం అందకపోవడంతో మరణిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతూ కలెక్టర్ రవి పటాన్ శెట్టికి మంగళవారం లోకనాథం లేఖ రాశారు. రావికమతం మండలం మట్టవానిపాలెం గ్రామంలో డి.శ్రావణ్‌కుమార్ (28), ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెంలో 16ఏళ్ల బాలిక, రాంబిల్లి మండలం చింతలపాలెంలో ఎల్లబిల్లి నారాయణ (40), వెంకయ్య పాలెంలో నవదీప్ (13), నేవీకాలనీలో ఒకరు డెంగ్యూ జ్వరంతో చనిపోయారని తెలిపారు. ఎన్ఎఒబి నిర్మాణ పనుల్లో పనిచేస్తున్న వలస కార్మికులు సుమారు 15 మంది వరకు డెంగ్యూతో మరణించినట్లు వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. నాన్‌షెడ్యూల్డ్ గిరిజన గ్రామాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా వుందన్నారు. ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులో వైద్యం లేకపోవడంతో జ్వరాలు వచ్చిన వెంటనే ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్ళడంతో ఈ కేసులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నమోదు కాలేదన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం జిల్లాలో గతేడాది డెంగ్యూ కేసులు 110 నమోదైతే ప్రస్తుతం 145, మలేరియా గతేడాది 38 నమోదు కాగా, ప్రస్తుతం 85 నమోదైందని, ఈ సంఖ్య మరింత ఎక్కువగానే వుంటుందని తెలిపారు. పెరుగుతున్న డెంగ్యూ, మలేరియా కేసులను పరిగణలోకి తీసుకొని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులకు నిధులను విడుదల చేయాలని, నిధుల సమస్యలేని చోట సత్వరమే పనులు జరిగేలా చూడాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సకాలంలో సరైన సేవలందించేలా ఏర్పాటు చేయాలని, అవసరమైన మందులు సిద్ధం చేయాలని, జ్వరాలు ప్రబలిన గ్రామాల్లో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించరూ..

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో వెనుకబడిన తరగతుల, సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు లేకపోవడంతో ప్రైవేట్ భవనాల్లో అరకొర వసతులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ జిల్లా నాయకులు కోన లక్ష్మణ, బిఎస్‌పి నాయకులు సూదికొండ మాణిక్యాలరావు, బిసి నాయకులు వాయిబోయిన శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు డిఆర్ఓ అనితకి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకు తగినన్ని రూములు లేకపోవడంతో హాస్టల్ అధికారి కార్యాలయంలో విద్యార్థులు ఉండాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు. వసతి గహాల్లో పనిచేసే సిబ్బందికి బకాయి పడ్డ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



దిలీప్‌కుమార్‌ను సత్కరిస్తున్న తుమ్మపాల నాయకులు

దిలీప్ కుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి రాష్ట్ర కార్యదర్శి, ఇన్లాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్‌ను గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విల్లూరి సూరి కుమారి చంద్రశేఖర్, ఎంపీటీసీ పంచదారల కన్నారావు అశోక్ , దుంతులూరి కళ్యాణ్ చక్రవర్తి, వైస్ ప్రెసిడెంట్ చదరం చిన్న , వార్డ్ మెంబర్లు జెర్రిపోతుల శ్రీలక్ష్మి , పట్నాల రాజేశ్వరి, వెలగా మోది నాయుడు, కొణతాల అర్జున్ నాయుడు, ముత్యాల వెంకట లక్ష్మీ, కండెల్లి గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన మలసాల దంపతులు

ప్రజాశక్తి - కశింకోట : కశింకోట మాజీ జెడ్పీటిసి మలసాల ధనమ్మ, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు దంపతులు మంగళవారం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్, వైసిపి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి అనందకుమార్ పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి జగన్‌తో మలసాల దంపతులు, మంత్రి అమర్‌నాథ్

డిగ్రీ 2, 4 సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయండి



తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - యలమంచిలి : సిలబస్ పూర్తి కాకుండా పరీక్షలు నిర్వహించడం హేతుబద్ధం కాదని, తక్షణమే డిగ్రీ 2, 4 సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. అనంతరం స్థానిక ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి తహశీల్దార్ రాణీఅమ్మాజీకి వినతి పత్రం అందజేశారు. యలమంచిలి ప్రభుత్వ గురజాడ డిగ్రీ కళాశాలలో సుమారు 1100 మంది డిగ్రీ విద్యార్థులున్నారని, డిగ్రీ సిలబస్ పూర్తికాకుండా సెకెండ్, ఫోర్త్ సెమిస్టర్ పరీక్షలు నిర్వహంచడానికి ఆంధ్రాయూనివర్సిటీ నిర్ణయించిందని, దాన్ని వాయిదా వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు ఆర్.ఆదికేశవ, జి.బంగారు చిట్టి, జె.శ్రీను, ఎ.సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

బస్సుల సమస్యపై డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి కాంప్లెక్స్‌కు రాకుండా హైవే మీదుగా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్, సూపర్, అల్ట్రా డీలక్స్ బస్సులను అనకాపల్లి కాంప్లెక్స్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా అధికారికి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ, ఉపాధ్యక్షులు అల్లు రాజు, నాయకులు పాంగి చలపతి, తరుణ్ మంగళవారం కలిసి పత్రాన్ని అందజేశారు. అనకాపల్లి జిల్లా కేంద్రమైన తరువాత ప్రయాణీకుల రాకపోకలు పెరిగాయని, విజయవాడ, రాజమండ్రి, ఇతర సుదూర ప్రాంతాలకు ప్రయాణాలు చేసే వారి సంఖ్య కూడా పెరిగిందని తెలిపారు. ఒకటి రెండు బస్సులు మినహా మిగిలిన ఎక్స్‌ప్రెస్, సూపర్, అల్ట్రా డీలక్స్ బస్సులు అనకాపల్లి కాంప్లెక్స్‌కి రాకుండా హైవే మీదగా వెళుండడంతో హైవేకి వెళ్ళి ఎక్కడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని బస్సు అనకాపల్లి కాంప్లెక్స్‌కు వచ్చే విధంగా చేసి ప్రయాణం సులభతరం చేయాలని కోరారు.

ఘనంగా ఎంపిడిఓ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎంపిడిఒ కె.వి నరసింహ నరసింహారావు జన్మదినం సందర్భంగా మంగళవారం ఎంపీపీ ఆఫీస్‌లో ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ధర్మారావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, మండల ప్రజా పరిషత్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మునగపాక రూరల్



తిమ్మరాజుపేటలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు పేరుతో ప్రజలపై భారాలు మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 30 నుండి సెప్టెంబర్ 4 వరకు సిపిఎం నిర్వహిస్తున్న సమరభేరి వాల్ పోస్టర్లను మంగళవారం స్థానిక మెయిన్ రోడ్డులోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ 30 , 31 తేదీల్లో ప్రచారం, సంతకాల సేకరణ, 1న సచివాలయాల వద్ద ధర్నాలు, వినతిపత్రాలు సమర్పిస్తామని, 4న అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల వలన పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు, విద్యుత్ భారాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీని గాలికొదిలేసి 7 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని, ఇప్పుడు నెలవారీ పెంపుదలకు రంగం సిద్ధం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, ఎస్ బ్రహ్మాజీ, పెంటకోట సత్యనారాయణ, అల్లారపు లోవేశ్వరరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : సమరభేరి గోడ పత్రికలను మంగళవారం మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ నేడు దేశంలో నిరుద్యోగ సమస్య వెంటాడుతుందని, లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని విమర్శించారు. మోడీ ప్రభుత్వం వచ్చేనాటికి రూ.450 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1200కు పెరిగిందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు అంతులేకుండా పెరుగుతున్నాయని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు 40శాతం వరకు పెరిగాయని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు, ఎస్ రామునాయుడు, బి.రామకుమార్, ఎన్.సన్యాసిరావు ఎస్ ఆదినారాయణ పాల్గొన్నారు.

సంతకాలు సేకరణ

కె.కోటపాడు : సిపిఎం సమరభేరిలో భాగంగా మండలంలోని కె.కోటపాడు, గొండుపాలెం, కింతాడ గ్రామాలలో మంగళవారం సిపిఎం జిల్లా నాయకులు గండి నాయినబాబు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేశారు. గ్రామంలో ప్రజల వద్ద నుంచి సంతకాల సేకరించి వారికి ప్రభుత్వ అమలు చేస్తున్న విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎర్ర దేవుడు, పార్టీ సానుభూతిపరులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

మూడు నెలల్లో లింకు రోడ్లు పూర్తి

ప్రజాశక్తి-చోడవరం : వచ్చే మూడు నెలల కాలంలో నియోజకవర్గంలో ఉన్న లింకు రోడ్లన్నీ పూర్తవుతాయని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. మంగళవారం అంబేరుపురం, లక్ష్మీపురం తారు రోడ్డు పునర్నిర్మాణ పనులను శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో సుమారుగా 30 లింకు రోడ్లు రూ.10 కోట్లతో పనులు ప్రారంభించమన్నారు. అంతరం కొత్తగా మంజూరైన పింఛన్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బుద్ధ గంగరాజు, బైన ఈశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీడీవో చైతన్య, బండారు సత్యనారాయణ, చోడవరం సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : అర్హతే కొలబద్దగా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. సోమవారం బుచ్చయ్యపేట ఎంపీడీవో కార్యాలయంలో నూతన పింఛన్ లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుచ్చయ్యపేట మండలానికి 175 నూతన పెన్షన్లు మంజూరైనటుల చెప్పారు. 254 మంది అర్హులు ఉన్నారని, మిగిలిన వారికి అక్టోబర్‌లో వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైసిపి నాయకులు కొలిమల్ల అచ్చినాయుడు, డి.నారాయణ మూర్తి, ఎంపీడీఓ సువర్ణ రాజు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆరోపణలు సరికాదు

ప్రజాశక్తి -దేవరాపల్లి : ఇసుక వ్యవహారంపై టిడిపి నాయకులు అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని మాజీ ఎంపీపీ, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు హెచ్చరించారు. స్థానిక రైవాడ అతిథి గృహం వద్ద మంగళవారం వైసిపి నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు హయాంలో మాడుగుల నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేస్తుంటే, ఓర్వలేని తనంతో టిడిపి నాయకులు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. జడ్పిటిసి కర్రి సత్యం మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ బూడి మూడోసారి గెలిచి తీరుతారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బూరె బాబురావు వరదపు రెడ్డి సింహాచలం నాయుడు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

వినికిడి పరికరం అందజేత

ప్రజాశక్తి - కశింకోట : మండలం, బయ్యవరం గ్రామానికి చెందిన బోదిపి మాధవరావు -మోహిని దంపతుల కుమారుడు మనోజ్ కుమార్‌కు వినికిడి పరికరాన్ని ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి మంగళవారం అనకాపల్లిలోని తన క్యాంపు కారాలయంలో అందజేశారు. మనోజ్‌కుమార్‌కు పుట్టుక నుండి చెవి వినికిడి సమస్యతో బాధపడుతున్న నేపథ్యంలో వైద్యులు చెవి వినికిడి పరికరాన్ని అమర్చారు. అది పని చేయకపోవడంతో కొత్త పరికరం కొరకు ఆర్థిక సహాయ నిమిత్తం తల్లిదండ్రులు ఎంపీ సత్యవతమ్మ గతంలో కలిశారు. దీంతో ఆమె ఎంపీ నిధుల నుండి వినికిడి పరికరం నిమిత్తం సుమారు 5 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ కుమార్, ఎంపీపీ కలగా లక్ష్మి, ఉగ్గినిపాలెం సర్పంచ్ గున్నయ్య నాయుడు, వైసిపి నాయకులు గొల్లవిల్లి శ్రీనివాసరావు, నాగరాజు పాల్గొన్నారు.

పాల సొసైటీ అధ్యక్షునికి డిప్యూటీ సిఎం అభినందనలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని అడవి అగ్రహారం గ్రామ పాల సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన పడాల శ్రీనివాస్ తారువలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శ్రీనివాస్‌ని బూడి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సలాది గంగా శేషు, వైసిపి నాయకులు గొల్లవిల్లి స్వామి నాయుడు, గంటా ముత్యంనాయుడు, సలాది చిన్న సన్యాసిరావు, సలాది మల్లిబాబు, డి.నాగేశ్వరరావు, నమ్మి బలరాం, సత్యరావు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి-మునగపాక రూరల్



వేదిక ముందు బైఠాయించిన అధికార పార్టీ సభ్యులు

స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడి వేడిగా జరిగింది. వైసిపి సర్పంచులు, ఎంపీటీసీలు అభ్యంతరాలు, ప్రశ్నల పరంపరలతో సభ కొనసాగింది. వ్యవసాయ అధికారిని జోష్న కుమారి తన నివేదికను సభ్యులకు తెలియజేసే క్రమంలో సర్పంచులు వేదిక ముందుకు దూసుకొచ్చి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా సచివాలయాలకు అందజేస్తున్న రూ.20 లక్షలు తమ ప్రమేయం లేకుండా ఖర్చు చేయటంపై అసహనం వ్యక్తం చేశారు. కనీసం పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితులలో సర్పంచులు ఉన్నారని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎంపీడీవో కార్యాలయం మరమ్మత్తులకు ఆయన ఖర్చు ఏ విధంగా, ఎంత జరిగిందో లెక్కలతో తెలపాలని ఎంపీటీసీ సభ్యులు పట్టుబట్టారు. స్వపక్ష సభ్యుల నుండి నిరసన వ్యక్తం కావడంతో ఎంపీపీ మల్ల జయలక్ష్మి సమాధానమిస్తూ సభ అయిన అనంతరం లెక్కలు మీ ముందు ఉంచుతామని, ఆ సొమ్మును ఎవరు బుక్క లేదని అనటంతో ఎంపీటీసీ సూరిశెట్టి రాము ఆమె మాటలకు తీవ్ర అభ్యంతరం తెలియజేశారు. సభను బహిష్కరించి బయటకు వెళ్లే ప్రయత్నం పలుమార్లు ఎంపీటీసీ సభ్యులు చేయగా వారిని వారించే ప్రయత్నాలు చివరికి విఫలమయ్యాయి. కార్యక్రమంలో జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీడీవో మన్మధరావు, డిప్యూటీ తహశీల్దార్ వినయ్ కుమార్, ఏవో ప్రసాద్ కుమార్, ఈఓపిఆర్‌డి పెంటకోట ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్ఎబిబి కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు



నినాదాలు చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-రాంబిల్లి

మండలంలో ఎన్ఎబిలో రోజుకు 12 గంటల పాటు కార్మికుల చేత పని చేయించుకొని వారికి కనీస వేతనాలు ఇవ్వకపోవడం దారుణమని, తక్షణమే కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక తుఫాన్ బిల్డింగ్ వద్ద మంగళవారం జరిగిన సిఐటియు మండల సమన్వయ కమిటీ సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ కనీస వేతనాలు, సౌకర్యాలు అడిగితే తొలగించడం అన్యాయమన్నారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, వివోఏలు వీఆర్ఏల చేత ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వాలకు లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు, జి.దేముడునాయుడు, ఎన్ఎబిబి నిర్మాణ కార్మికులు, ఆటో, ముఠా, బిల్డింగ్, పంచాయతీ కార్మికులు, అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజనం, వివోఏ, లారీ డ్రైవర్స్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తట్టుకొనే యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - యలమంచిలి : నీటి ఎద్దడిని తట్టుకొనే యాజమాన్య పద్ధతులు శ్రద్ధగా పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, తెగుళ్ల నివారణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కొక్కిరాపల్లి, అనకాపల్లి పరిశోధనా శాలల శాస్త్రవేత్తలు డాక్టర్ ఏబిఎం శిరీష, డాక్టర్ రాజేంద్రప్రసాద్ మంగళవారం యలమంచిలి, కొత్తపాలెం గ్రామాలకు చెందిన వరి పొలాలు పరిశీలించారు. వరి ఉడిచిన 15, 20 రోజుల తర్వాత కలుపు నివారణ కోసం బిస్పైరీ బ్యాక్ సోడియం మందును లీటరు నీటిలో 0.5 ఎం.ఎల్. కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పొలాల్లో పొడ తెగులు వచ్చే సూచనలున్నాయని దాన్ని ఎదుర్కొనడానికి హెక్సకొనజాల్ మందును 200 లీటర్ల నీటిలో 200 మి.లీ.కలిపి పిచికారీ చేయాలని కోరారు. శాస్త్రవేత్తలు రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాల్లోని దిమిలి, మామిడివాడ, తిమ్మాపురం, గోకులపాడు గ్రామాల వరి పంటలు సందర్శించారు. కార్యక్రమంలో ఎడిఎ రవిప్రకాష్, ఏఒ మోహనరావు, విజేత, సమంత, సౌజన్య, దేముడు, సంతోషి, మేఘన, అరుణ, ధనరాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - యస్.రాయవరం : నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రధాన సమస్యలపై 18 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు ఎం అప్పలరాజు ఆధ్వర్యంలో అందజేశారు. ఎస్ రాయవరం మండలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, బంగారమ్మపాలెం నాబ్ నిర్వాసితులకు ప్యాకేజీ, ఫిషింగ్ జెట్టీ నిర్మాణం, అడ్డురోడ్డులో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు, సోముదేవుపల్లి, ధర్మవరం అగ్రహారం గ్రామాల వద్ద వరహానదిలో గ్రోయిన్ల ఏర్పాటు, ధర్మవరం అగ్రహారం నుండి పాయకరావుపేట వరకూ జాతీయ రహదారిపై ప్రధాన కూడళ్లలో విద్యుద్దీపాల ఏర్పాటు, ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి సొంత భవనాలు, పూర్తిస్థాయిలో లెక్చరర్స్ నియామకం, వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు ప్యాకేజీ చెల్లింపు, ఉద్దండపురంమెగా వాటర్ ప్రాజెక్టు పూర్తి చేసి, గ్రామాలలో ఇంటింటికి రక్షితనీటి సౌకర్యం కల్పన, హెటిరో డ్రగ్స్‌కంపెనీ కొత్త పైపులైనుకు అనుమతులు రద్దు, తాండవ వరాహనదులకు ఇరువైపులా పటిష్టమైన గట్లు నిర్మాణం, రాజవరం పెంటకోట గ్రామాల మధ్య తాండవనదిపై వంతెన నిర్మాణం, పాయకరావుపేట ప్రభుత్వ ఐటిఐసొంతంభవనం నిర్మాణం, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు, కోటవురట్ల మండలం జల్లూరు యండపల్లి వద్ద, పందూరు వరహా నదిపై వంతెనను పూర్తిచేయడం, అణుకు, కోదండ రామపురం, తడపర్తి బోను కొత్తూరు గ్రామాలకు నిలిచిపోయిన గిరిజన గ్రామాలకు రోడ్లు పూర్తిచేయడం, పోలవరం ఎడమ కాలువ ఎగువ ప్రాంత భూములకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు సౌకర్యం, బిసి రెసిడెన్షియల్ కాలేజీ ఏర్పాటు, మూసివేసిన తాండవ ఏటుకొప్పాక షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించడం, తదితర ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం ఎం.సత్యనారాయణ బి.నాగేశ్వరావు ఎం.రాజేష్ కె.సుబ్బాజీ ఎం.జగ్గ కె.అప్పలకొండ పాల్గొన్నారు



నేత్ర దానంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం కంటి వైద్య నిపుణులు డాక్టర్ జివి వైదేహి అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం 38వ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత్రదానం, నేత్ర సంరక్షణపై వచ్చేనెల 8వ తేదీ వరకు ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఆసుపత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికీ అంధత్వ నివారణ సంస్థ ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమా, ఎం.నవీన, ఎన్ మాధవి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు చోడవరం విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-చోడవరం : ఈ నెల 27, 28 తేదీల్లో కాకినాడ పిఆర్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన 39వ సీనియర్స్ క్యొరుగి, 12వ పూమ్‌సే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో చోడవరం, అనకాపల్లికి చెందిన విద్యార్థులు 1 గోల్డ్ మెడల్, 4 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. చోడవరంకు చెందిన ఓవర్ -30వ మెన్ డివిజన్‌లో పల్లం మురళీకృష్ణ బంగారు పతకం సాధించి, వచ్చే నెల 9వ తేదీ నుండి 11 వరకు అస్సాం రాష్ట్రం, గౌహతిలో జరగబోయే జాతీయ స్థాయి 39వ క్యొరుగి, 12వ పూమ్ సే తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ టి హర్ష వర్ధన్ ప్రసాద్ అభినందించారు.

గడప గడపకు వైద్యం అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : గడపగడపకు వైద్యం అందించాలని లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని అనకాపల్లి ఎంపీ బీవీ సత్యవతి చెప్పారు. హోమియో బాబా క్యాన్సర్ రీఛార్జ్ సెంటర్ వారి అవేర్నెస్ శిబిరాన్ని మంగళవారం మండలంలోని కాజీపాలెం గ్రామంలో ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎంపీ మాట్లాడుతూ విద్య వైద్యం ముఖ్యమంత్రికి రెండు కళ్ళ వంటివి అన్నారు. కేన్సర్ నిర్మూలన కోసం మన రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా తిరుపతి, అనకాపల్లి జిల్లాలలో కేన్సర్ అవేర్నెస్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ హేమంత్ కుమార్, డిసిసిబి మాజీ మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, ఎంపిపి కోన సంధ్య, గ్రామ సర్పంచ్ పీలా నర్సింగరావు, వైసిపి నాయకుడు కోన లచ్చన్న నాయుడు, మాజీ సర్పంచ్ డి నాగేశ్వరరావు, దొడ్డి కృష్ణ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : వైసీపీ ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టి, తక్షణమే అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని టిడిపి మాడుగుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని శారదా నది పరివాహక ప్రాంతాలలో పలుచోట్ల జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై మంగళవారం టిడిపి శ్రేణులతో కలిసి స్థానిక తహశీల్దార్ ఎం.లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివద్ధి పనులు ముసుగులో ఇసుకను దోసేస్తున్నారని ఆరోపించారు. మంత్రి బూడి అండతో వైసిపి నాయకులు బహిరంగంగా ఇసుకను అమ్ముకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శరఖాన సూర్యనారాయణ, చల్లా నానాజీ, చింతా సాంబమూర్తి, కడిమి నాగేశ్వరరావు, జూరెడ్డి రాము పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థికి స్వర్ణం

ప్రజాశక్తి -కశింకోట : ఇటీవల హైదరాబాద్‌లోని బ్రూలీస్ పీట్ కన్ డి ఆధ్వర్యంలో జరిగిన 11 జాతీయ స్థాయి కరాటే పోటీల్లో స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాలకు చెందిన 4 తరగతి విద్యార్థి ఆడారి లోహిత్ స్వర్ణం సాధించాడు. ఈ సందర్భంగా లోహిత్‌ను కరాటే కోచ్ సిహెచ్ సూరి అప్పారావు, అకాడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి అభినందించారు.

పాల సంఘం అధ్యక్షునికి సత్కారం

ప్రజాశక్తి అచ్యుతాపురం : మండలంలోని గొర్లి ధర్మవరం గ్రామ విశాఖ డెయిరీ పాల కేంద్రం సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గొర్రెల సోము నాయుడును మంగళవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొర్రె అశ్విని నూకరాజు, జి రామ జోగి, మడక కోటేశ్వరరావు, జి ఈశ్వరరావు, జి నర్సింగరావు, జె ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

వ్యవహారిక భాషోద్యమనేత గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని, తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- ప్రజాశక్తి-యంత్రాంగం

వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులుకు ఘననివాళి



విశాఖలో గిడుగుకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖ కలెక్టరేట్ : తెలుగు భాషా వైభవానికి పునాదులు వేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి అని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన తెలుగు భాషా దినోత్సవం, వాడుక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి కార్యక్రమాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, పరిపాలనాధికారి ఈశ్వరరావు, డిఎల్‌డిఒ పూర్ణిమాదేవి, సమాచార శాఖ ఆర్‌జెడి మణిరామ్ పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో కళా ప్రపూర్ణ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి నిర్వహించారు. తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, జి.యోహానుబాబు, డాక్టర్ దామెర వెంకట సూర్యారావు, డాక్టర్ మీగడ రామలింగస్వామి పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిహెచ్.సూర్యప్రసాద్, ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు, పాల్గొన్నారు. జివిఎంసి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సిహెచ్.సింహాచలం అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత కుమారి, అల్లాడ శ్రీనివాసరావు, రామకృష్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. రాయిపాలెం జివిఎంసి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జయంతి రాధాకుమారి, చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం పొట్నూరు మురళీమోహన రావు అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవాలు నిర్వహించారు. భీమిలిలోని పిఎస్ఎం, జివిఎంసి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం తిరుమలశ్రీదేవి అధ్యక్షతన నిర్వహించారు.

పద్మనాభం : మండలంలోని మద్ది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు.

సింహాచలం: సింహాచలం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి నరసింహ ఆధ్వర్యాన గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పివి.రమణ, దేవస్థానం సాంస్కృతిక ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని వెంగలపూడి వేణు పాల్గొన్నారు.

పిఎం.పాలెం : చంద్రంపాలెం హైస్కూల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, పద్య పఠనం, చిత్రలేఖనం, క్విజ్, సామెతల పోటీలను నిర్వహించారు. 111 మంది కవుల చిత్రపటాలు, వారి జీవిత విశేషాలతో కూడిన చిత్రాలను సేకరించి పాఠశాలలో కవి మేళాగా ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయులు ఎం.రాజబాబు ఈ మేళాను ప్రారంభించారు. పోటీలలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఒడి జి.సూర్యకుమారి, పిఎస్ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిడుగుపై నిర్వహించిన వక్తృత్వ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్రకారుడు సుంకర చలపతిరావు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి, కవి కె.సత్తిరాజు, న్యాయవాది జికెవి.రాజు, ఇపిఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయా దేవి, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట :కొత్తకోట, టి.అర్జాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా,జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. టి అర్జా పురం పాఠశాలలో వ్యాసరచన, క్విజ్, పద్య పఠన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.. తెలుగు తల్లి వేషధారణ అందర్నీ ఆకట్టుకుంది. మాతృభాష ప్రాధాన్యతను ఇన్‌ఛార్జి హెచ్ఎం సిహెచ్ మల్లునాయుడు తెలుగు టీచర్లు కె త్రివేణి,ఎ వరహాలమ్మ,.సిఆర్‌పి రామారావు వివరించారు.

కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి తెలుగులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులను ఘనంగా సత్కరించారు. గత ఏడాది పబ్లిక్ పరీక్షలలో వికలాంగ విద్యార్థులకు స్క్రైబ్‌గా సేవలందించిన ఐదుగురు విద్యార్థులకు సేవారత్న అవార్డుతో సత్కరించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. హెచ్ఎం కె.నాగేశ్వరరావు తెలుగు ఉపాధ్యాయులు గుమ్ముడు కన్నయ్య దొర, సుజాత, నిర్మల, పిఇటి పి. రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పాయకరావుపేట: స్థానిక శ్రీచైతన్య విద్యాసంస్థలో తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి మాణిక్యాలరావు, ఎజిఎం ఎంవి.సురేష్, ఆర్ఐ గోపీనాథ్, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ తెలుగు పండితులు శ్రీపాద సత్యనారాయణ తెలుగు భాషా ఔన్నత్యాన్ని వివరించారు. తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన సేవలు కొనియాడారు.. పద్య,వ్యాసరచన పోటీలలో విజేతలైన విద్యార్థులకు ప్రిన్సిపల్ మాణిక్యాలరావు బహుమతులు అందించారు. అకాడమిక్ కోఆర్డినేటర్ వెంకటరమణ, డీన్ విజయ్, ఎఒ విజయ్, తెలుగు ఉపాధ్యాయులు అప్పలరాజు, వెంకటేశు గోవిందరావు, మాలతి, అనూష, కామాక్షి, వేణుప్రియ పాల్గొన్నారు

నక్కపల్లి :నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాల, పెదబోదుగల్లం రాజయ్యపేట తదితర పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు..విద్యార్థులకు పద్య పఠన ,వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. హెచ్ఎం రాణి లలిత, సత్యనారాయణ ,నారాయణరావు, కెజిబివి ప్రత్యేక అధికారిణి షేక్ సలీమా, తెలుగు ఉపాధ్యాయులు ఎన్‌విఎస్ ఆచార్యులు ,టి వెంకటరమణ, రమాకుమారి, రామచంద్రరావు, డివిఎస్ రావు పాల్గొన్నారు.

యస్ రాయవరం: రాయవరం వినయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, గుడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో తెలుగు భాషాదినోత్సవాన్ని నిర్వహించారు. వినయ్ స్కూల్ తెలుగు టీచర్ గంగాభవాని సత్యవేణి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటపాటలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు గుడివాడ పాఠశాలలో ఉపాధ్యాయిని పద్మావతి పర్యవేక్షణ కోలాటనృత్యాలు, తప్పెటగుళ్లు, ఇతర సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహించారు. తెలుగు టీచర్లను సత్కరించారు. వినయ్ స్కూల్ చైర్మన్ బత్తుల వాసు పాల్గొన్నారు.

కోటవురట్ల: స్థానిక కస్తూర్బా పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి జయంతి ఘనంగా నిర్వహించారు, రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు, క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో పలు విన్యాసాలు చేయించారు, పాఠశాల ప్రత్యేక అధికారి సరితా దేవి పాల్గొన్నారు.



కోటవురట్ల కస్తూర్బాలో తెలుగు భాషా దినోత్సవం



అనకాపల్లిలో గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

అనకాపల్లి :గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకొచ్చిన సంస్కర్త గిడుగు వెంకట రామ్మూర్తి అని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి కొనియాడారు. గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో గిడుగు చిత్రపటానికి కలెక్టర్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్షరాస్యత పెరుగుదలకు, విద్య, పత్రికల ద్వారా లోకజ్ఞానం, వివిధ శాస్త్రాల విజ్ఞాన విషయాలు తెలుసుకునేందుకు వాడుక భాష దోహదం చేసిందని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎ.శ్రీనివాసరావు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక వన్ వే ట్రాఫిక్ జంక్షన్‌లోని తెలుగు తల్లి విగ్రహం వద్ద తెలుగు భాషా దినోత్సవం సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్ల నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించారు.

యలమంచిలి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన తెలుగుభాషా దినోత్సవంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ వాడుక భాష అభివృద్ధికి గిడుగు చేసిన కృషిని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ రేఖా రామారావు, సీనియర్ అధ్యాపకులు జగ్గారావు, సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక కొత్తపేట హైస్కూల్ హెచ్ఎం వైవి.రమణ ఆధ్వర్యాన తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది ఎంపిపి స్కూల్‌లో హెచ్ఎం టివి.శేషగిరిరావు గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అరిపాక కామేశ్వరరావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలో అయితంపూడి ఎంపీపీ స్కూల్లో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో తెలుగు తల్లి వేషధారణ వేయించి విద్యార్థులకు తెలుగు భాష గొప్పతనం గురించి హెచ్ఎం శ్రీను, ఉపాధ్యాయులు హరికృష్ణ, శ్రీనివాస్ వివరించారు. దిబ్బిడి జెడ్‌పి హైస్కూల్‌లో హెచ్ఎం సత్యారావు ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేశారు. భారీ జాతీయ జెండాతో దిబ్బిడి నుండి బుచ్చయ్యపేట వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

పరవాడ : మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ ఎస్.సీతామహాలక్ష్మి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని పద్య, గేయ, నాట్య, కథ, కవిత, నాటక రూపంలో ప్రదర్శించారు. జ్ఞాపికలను పాఠశాల సీఈఓ కె.నిశంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి అందించారు. స్థానిక గొన్నా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ హెమ్‌చంద్ నాయుడు మాట్లాడారు. ప్రిన్సిపల్ పిఎస్ఎన్ మూర్తి, ఆచార్యులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని ఏ.కొత్తపల్లి జెడ్‌పి హైస్కూల్‌లో హెచ్ఎం వై.స్వర్ణలత గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సబ్బవరం : దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వర్సిటీ ఇన్‌ఛార్జి విసి ఆచార్య పి.శ్రీసుధ మాట్లాడారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ పి.జోగినాయుడు, సిహెచ్ లక్ష్మి పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సమరెడ్డి తిరుపతిరావు గిడుగు చిత్ర పటానికి పూలమాలలు వేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెందుర్తి: పెందుర్తి శాఖా గ్రంథాలయంలో గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, గ్రంథాలయ పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి -యస్ రాయవరం :మాతాశిశుసంరక్షణ, మరణాల నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వ పథకాలకు సక్రమంగా అమలు చేయడంలో ఆశాకార్యకర్తలు, సచివాలయ హెల్త్‌సెక్రటరీలు సమర్థవంతంగా పనిచేయాలని పలువురు వైద్యులు సూచించారు. మంగళవారం సర్వసిద్ధి పిహెచ్‌సిలో సర్వసిద్ధి పిహెచ్‌సి, పెద్దపల్లి, సోమలింగపాలెం యుపిహెచ్‌సిల పరిధిలోని హెల్త్ సెక్రటరీలు, ఆశాకార్యకర్తలకు శిక్షణనిచ్చారు. వైద్యాధికారులు డాక్టర్ ఎస్.వాసంతి, డాక్టర్ శ్రావ్య, పిహెచ్ఎన్ఎం.రత్న సఖి, ఆశా నోడల్ పర్సన్ పర్యవేక్షణలో సెంట్రల్ టీమ్ సభ్యులు, కిల్కారి మొబైల్ అకాడమీ ప్రోగ్రామ్ మేనేజర్ కె.రాజు ఆధ్వర్యంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ అర్.మోహన రావు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై చేపట్టాల్సిన సూచనలు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి బి సత్యనారాయణ, హెల్త్ విజిటర్. ఎస్.సూర్య కుమారి పాల్గొన్నారు.

వైసిపి విజయానికి పనిచేయాలి

ప్రజాశక్తి-గొలుగొండ :గృహసారథులు, కన్వీనర్లు వైసిపి గెలుపు కోసం పని చేయాలని జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ల అధ్యక్షులు కొరుప్రోలు పాణిశాంతారామ్ అన్నారు. మంగళవారం పప్పుశెట్టిపాలెం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వీరికి బీమాకు అవసరమైన పత్రాలను అందజేశారు. పప్పుశెట్టిపాలెం సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మీ, మండల యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు పాల్గొన్నారు.

దిబ్బలపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యశిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో పాకలపాడు పంచాయతీ దిబ్బలపాలెం గ్రామంలో మంగళవారం చీడిగుమ్మల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యశిబిరం నిర్వహించారు. 53 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దీర్ఘకాలిక రోగులున్న ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందజేశారు.

యువగళం పాదయాత్ర జయప్రదానికి పూజలు

ప్రజాశక్తి -కొత్తకోట :నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర దిగ్విజయంగా సాగాలని కోరుతూ కొత్తకోటలో మంగళవారం చోడవరం నియోజకవర్గం తెలుగుమహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి ఆధ్వర్యంలో కనకదుర్గా ఆలయంలో పూజలు చేశారు. నేతలు కోట గోవిందరావు, కోట సత్యనారాయణ, వెల్లంకి ఈశ్వరరావు, కలం నర్సింగరావు, చేపూరు శ్రీను, కోట బంగారుతల్లి, కొర్ని రాజు, దుప్పట్ల ఉమాదేవి పాల్గొన్నారు.,..

నర్సీపట్నం టౌన్ : నారా లోకేష్ పాదయాత్ర విజయవంతంగా సాగాలని ధర్మసాగరం రామాలయంలో జెడ్‌పిటిసి సుకల రమణమ్మ ఆధ్వర్యంలో తెలుగుమహిళలు పూజలు నిర్వహించారు. లోకేష్‌కు మహిళలంతా ముందుగా రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

సాగు యాజమాన్య పద్ధతులు కీలకం

ప్రజాశక్తి ఎస్.రాయవరం : వరి సాగులో యాజమాన్య పద్ధతులు కీలకమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం తిమ్మాపురం గోకులపాడు గ్రామాల్లో ఎఒ సౌజన్య ఆధ్వర్యంలో ఎలమంచిలి వ్యవసాయ డివిజన్ వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం క్షేత్రస్థాయిలో పంటపొలాలను పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధనకులు శాస్త్రవేత్త డాక్టర్ఎబియం శిరీష, అనకాపల్లి శాస్త్రవేత్త డాక్టర్ వి రాజేంద్రప్రసాద్ యలమంచిలి ఎడిఎ రవిప్రకాష్, డిఆర్‌సి అనకాపల్లి ఎఒ విజేత, సర్పంచ్ కర్రి సత్యనారాయణ, మండగుడుల రమణ, దనరాజు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రిజర్వాయర్ల సమస్యలపై నిర్లక్ష్యం



పాద యాత్ర చేస్తున్న రామానాయుడు

ప్రజాశక్తి- మాడుగుల: జలాశయాల సమస్యలపై వైసిపి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఆరోపించారు. ఎన్‌టిఆర్ జలాశయం సమస్య పరిష్కరించాలని మంగళవారం వీరవల్లి నుండి పాదయాత్ర ప్రారంభించారు. పాదయాత్రలో టిడిపి నేతలు, శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు













ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై విస్తృత ప్రచారం



ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలపై మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక రామారావుపేటలో ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై అనేక భారాలు వేస్తుందని నిత్యవసర వస్తువు ధరలు రోజురోజుకీ పెరుగుతున్నా యని గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరల పెంచి ప్రజలపై భారాలు వేస్తున్నారని విమర్శిం చారు. కార్పొరేట్ సంస్థలకు మాత్రం వేల కోట్లు రుణాలు మాఫీ చేస్తున్నారని అన్నారు. ప్రజలపై వేస్తున్న భారాన్ని తగ్గిం చాలని డిమాండ్ చేశారు.

ఐద్వా నేతలు ఎల్ గౌరీ, కె.సూర్యప్రభ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్, ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థలు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. విద్యుత్ ఛార్జీల భారం ఉండదని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన సిఎం జగన్, ఇబ్బడిముబ్బడిగా పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

ఫ్లోరైడ్ గ్రామాల్లో తాగునీటికి కటకట

- మూడురోజులుగా నిలిచిన సరఫరా

ప్రజాశక్తి - రోలుగుంట : మండలంలోని ఫ్లోరైడ్ గ్రామాల్లో మూడు రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోయిందని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు అన్నారు. మండల కేంద్రంతో పాటు నిండుగొండ, కె.నాయుడుపాలెం, కొవ్వూరు, ఎన్.కొత్తూరు, అంట్లపాలెం, రాజుపేట, మునిపెల్లి, గొల్లపేట గ్రామాలకు నీటిసరఫరా నిలిచిపోవడంతో 18 వేల మంది జనాభా ఫ్లోరైడ్ పీడిత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా గ్రామాలకు రక్షితతాగునీరు అందించేందుకు 2004లో రూ.3.5 కోట్లుతో రోలుగుంటలో నిర్మించిన భారీ ప్రాజెక్టు తరచూ మరమ్మతులకు గురౌతూ ప్రజలకు నీటి ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఫ్లోరైడ్ బాధితులకు తాగునీరు నిరాటంకంగా అందించే చర్యలు చేపట్టాలని కోరారు.

ఉత్తమ పాఠశాలకు ఉపాధ్యాయులు కరువు

- మంచాల ఆదర్శ పాఠశాలలో సమస్యల తిష్ట

ప్రజాశక్తి- చీడికాడ :రాష్ట్రస్థాయి ఉత్తమ పాఠశాలగా స్వాతంత్ర్యదినోత్సవ పురస్కారాన్ని పొందిన మంచాల ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులు కొరతతో, అనేక సమస్యలు తిష్టవేసి ఉన్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న తెలిపారు. పాఠశాలలో ఫిజిక్స్, సివిక్స్, హిందీ ఉపాధ్యాయ పోస్టులతోపాటు హాస్టల్ వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 532 మంది విద్యార్థులున్న పాఠశాలలో ఆర్ఒ ప్లాంట్ సౌకర్యం లేక పోవడం అన్యాయమన్నారు గతంలో నాసా స్వచ్ఛంద సంస్థ సమకూర్చి వాటర్ ప్లాంటు మూలకు చేరిందన్నారు. పాఠశాలకు రెగ్యులర్ వార్డెన్ లేకపోగా, తాత్కాలిక వార్డెన్ నెలరోజులుగా రాకపోతే, విద్యార్థినుల అనారోగ్యం, ఇతరత్రా సమస్యలను ఎవరు చూస్తారని, వారికి రక్షణ ఏంటని ప్రశించారు. తక్షణమే రెగ్యులర్ వార్డెన్‌తోపాటు హెల్త్‌వర్కర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. మరుగుదొడ్లు, వసతిగదుల్లో లైట్లు, డోర్లు, ప్యాన్‌ల ఏర్పాటు నిర్వహణకు కంటింజెంట్ నిధులు మంజూరు చేయాలని కోరారు. తిమిరాం, వాకపల్లి, చీడిపల్లి, తురువోలు, తంగడు బిల్లి మీదుగా స్కూల్‌కు ఆర్‌టిసి బస్సు నడపాలని కోరారు

రహదారి కోసం వినతి సిగ్గుచేటు

ప్రజాశక్తి- మాడుగుల: ఘాట్ రోడ్, కింతలి రహదారి నిర్మించాలని కలెక్టర్ వద్దకు వెళ్లి ఎంపిపితోపాటు వైసిపి ముఖ్యనేతలు మొరపెట్టుకోవడం సిగ్గుచేటని టిడిపి నేత పైలా ప్రసాదరావు ఎద్దేవా చేశారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు సొంత నియోజకవర్గంలో ఈ పరిస్థితి హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వం, అధికారం చేతుల్లో ఉన్నప్పటికీ, ప్రజలు మభ్యపెట్టడానికే ఇలా కలెక్టర్‌కు వినతులు వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ఆలయానికి మొక్కల వితరణ

ప్రజాశక్తి -యస్ రాయవరం: మండలంలో గోకులపాడు గ్రామంలో ఎజి పౌండేషన్ అధినేత నాగంబోయిన నాని చిన్న కుమారుడు గౌతమ్ జన్మదిన సంధర్భంగా రామాలయం ఆవరణలో నాటేందుకు రూ. పదివేల విలువ చేసే మామిడి సపోటా పనస నేరేడు పూల మొక్కలు, కుండీలు అందజేశారు. ఉపసర్పంచ్ నక్క శ్రీనివాసులు, ప్రగడ ప్రసాద్, బాదనపల్లి నానాజీ, పప్పల లోవజి, గుడుపు రమణ పాల్గొన్నారు